

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ఏలూరు : ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈ నెల 25వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం వికేంద్రీకరించిందని, ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం https://meekosam.ap.gov.in అధికారిక వెబ్‌సైట్ ప్రారంభించిందని తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

పిజిఆర్ఎస్‌లో జిమ్మిక్కులు..!

ఆన్‌లైన్ ఫిర్యాదులపై అధికారుల తీరుపై చర్చ

రీఓపెన్ చేసే వీల్లేకుండా 'కోర్టు కేసు' ఆప్షన్ పెట్టి ముగింపు

కోర్టులోలేని అంశాలను ఆ విధంగా ఎలా పెడతారంటూ ఫిర్యాదుదారుల ఆవేదన

ఒకేరీతిలో మత్స్యశాఖ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు

జిల్లా అధికారులకు చేరిన ఫిర్యాదుల్లోనే ఈ పరిస్థితంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నిడమర్రు మండలం అడవికొలను గ్రామం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 148 నుంచి 163లో ఉన్న 70 ఎకరాల చేపల చెరువులో ప్రభుత్వానికి చెందిన 94 సెంట్ల పంట భూమి ఉందని రెవెన్యూ అధికారులు తేల్చి హద్దులు విధించడం సైతం జరిగింది. సంబంధిత చెరువులో పంటబోదెను కాపాడాలంటూ మత్స్యశాఖ జిల్లా అధికారికి ఆన్‌లైన్‌లో పిజిఆర్ఆర్ ద్వారా ఫిర్యాదు చేశారు. మండల కమిటీ నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామంటూ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన మత్స్యశాఖ జిల్లా కార్యాలయం ఆ ఫిర్యాదు మళ్లీ రీఓపెన్ కాకుండా కోర్టు ఆప్షన్ పెట్టి ముగించింది. దీంతో ఇంకా ఆ ఫిర్యాదు రీఓపెన్ చేసే వీలులేకుండా చేశారు. కోర్టులోలేని అంశాలను కోర్టు కేసు ఆప్షన్‌లో ఎందుకు పెడుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది'

'చేపల చెరువులో ఉన్న ప్రభుత్వ పంట బోదెను రక్షించాలంటూ ఇరిగేషన్ జిల్లా అధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పంటబోదెను రక్షించాల్సిందిగా నిడమర్రు మండల తహశీల్దార్‌కు లేఖ ద్వారా తెలియజేసినట్లు ఇరిగేషన్ అధికారి ఎండార్స్‌మెంట్ ఇచ్చి కోర్టు ఆప్షన్ పెట్టి ఫిర్యాదును ముగించేశారు. దీంతో రీఓపెన్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. కోర్టులోలేని అంశాలను కోర్టు కేసు ఆప్షన్ ఎందుకు పెడుతున్నారంటూ ఫిర్యాదుదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'



కోర్టుకేసు ఆప్షన్ పెట్టి మత్స్యశాఖ అధికారులు ముగించిన ఆన్‌లైన్ పిజిఆర్ఎస్ ఫిర్యాదు

పిజిఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) ఫిర్యాదులపై జిల్లా అధికారులు జిమ్ముక్కులకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడం వదిలేసి వాటి నుంచి ఎలా తప్పించుకోవవాలన్న ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రతి సోమవారమూ జిల్లా కలెక్టరేట్‌తోపాటు, డివిజన్, మండలస్థాయిలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ప్రతి సోమవారమూ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్‌లో 250లకుపైగా ఫిర్యాదులు ప్రజల నుంచి అందుతున్నాయి. సోమవారం జరిగే పిజిఆర్ఎస్‌కు రాలేని వారు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వం కల్పించిన ఆన్‌లైన్ పిజిఆర్ఎస్‌పై ఇప్పుడిప్పుడే ప్రజలకు అవగాహన ఏర్పడుతోంది. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. జిల్లా ఉన్నతాధికారులు సైతం పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఫిర్యాదులపై ఆడిటింగ్ చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగం సైతం పనిచేస్తోంది. అయినప్పటికీ ఫిర్యాదు దారులకు న్యాయం అంతమాత్రమే అన్నట్లు తయారైంది. ఆన్‌లైన్‌లో ఏదైనా సమస్యపై మండలాధికారులకు జనం ఫిర్యాదు చేస్తున్నారు. వారు ఆ ఫిర్యాదును ముగించిన (క్లోజ్) తర్వాత తమ సమస్య పరిష్కారం కాకపోతే ఫిర్యాదుదారులు రీఓపెన్ చేస్తున్నారు. వెంటనే ఆ ఫిర్యాదు జిల్లా అధికారులకు చేరుతోంది. గడువులోగా అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోతే రీఓపెన్ చేస్తే రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేరుతోంది. సమస్యను పరిష్కరించకుండా తమకు తోచినట్లు ఎండార్స్‌మెంట్ ఇచ్చేస్తున్నారు. ఫిర్యాదుదారులు తిరిగి రీఓపెన్ చేస్తే రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుందన్న ఉద్దేశంతో జిల్లా అధికారులు కొంతమంది ఫిర్యాదుదారుల హక్కులను కాలరాస్తున్నారు. ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తర్వాత కోర్టు కేసు ఆప్షన్ పెట్టి ఫిర్యాదును ముగిస్తున్నారు. దీంతో ఆ ఫిర్యాదు మళ్లీ రీఓపెన్ కావడం లేదు. దీంతో ఫిర్యాదుదారులకు న్యాయం జరగని పరిస్థితి. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ జిల్లా అధికారులు సైతం ఇదే కోవలో నడుస్తున్నట్లు చెబుతున్నారు. మిగిలిన శాఖల్లో ఈ విధంగా ఎన్ని జరుగుతున్నాయో పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి. కోర్టు పరిధిలోని అంశాలను కోర్టు కేసు ఆప్షన్ పెట్టి ముగించడం తప్పుకాదు. కోర్టులోని అంశాలను కోర్టు కేసు ఆప్షన్ పెట్టి ఏవిధంగా ముగిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు రీఓపెన్ చేయకుండా అధికారులు చేస్తున్న జిమ్మిక్కులు జనంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులకు పట్టడం లేదు. నిడమర్రు మండలంలోని చేపల చెరువులో పంట బోదెను రక్షించే విషయంలో తమకు సంబంధం లేదంటూ మండలాధికారులు, మత్స్యశాఖ, ఇరిగేషన్ అధికారులు తప్పించుకుంటున్న పరిస్థితి. కోర్టు కేసు అంటూ ముగిస్తున్న ఫిర్యాదులను జిల్లా ఉన్నతాధికారులు మరోసారి ఆడిట్ పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు





ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడాంశాల్లో జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి ఎలాంటి సహకారం ఉంది, శిక్షకుల నియామకాలు ఏమైనా చేపడుతున్నారా వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించారు?

ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా సమ్మర్ క్యాంపులు నిర్వహించాం. అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, చెస్, జూడో, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్ వంటి 15 అంశాల్లో ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించాం. ఒక్క క్రీడక్లస్లో 50 మందికి పైగా ఈ సమ్మర్ క్యాంపుల్లో పాల్గొన్నారు.

ప్రశ్న : నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా టీం పాల్గొంటోందా?

నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా 10 క్రీడాంశాల్లో ఇప్పటికే జిల్లా సెలక్షన్ పూర్తి చేశాం. ఈ నెల 21న కాకినాడలో జోనల్ సెలక్షన్లు జరగనున్నాయి. అందులో గెలుపొందిన వారికి ఈ నెల 23 నుంచి 25వ తేదీ లోపు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తాం. అక్కడ గెలుపొందిన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదు బహుమతి అందించడం జరుగుతుంది.

ప్రశ్న : ప్రస్తుతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో ఎంత మంది కోచ్‌లు ఉన్నారు? రెగ్యులర్ కోచ్‌లు ఎంత మంది ఉన్నారు?

ప్రస్తుతం ఎనిమిది మంది కోచ్‌లు జిల్లా క్రీడా ఉపాధ్యాయుల సంస్థలో పనిచేస్తున్నారు. అందరూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. రెగ్యులర్ కోచ్‌లు లేరు. 20 ఏళ్లుగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నియామకాలు చేపట్టలేదు.

ప్రశ్న: క్రీడా పరికరాలు కొనుగోలుకు, ఇతర అవసరాలకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి నిధులు ఇస్తున్నారా, కనీసం క్రీడా పరికరాలు ఇస్తున్నారా?

ప్రస్తుతానికి ఎలాంటి నిధులూ రాష్ట్రం నుంచి రావడం లేదు. సమ్మర్ క్యాంపులు, ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నప్పుడు వాటి అవసరాలకు సరిపడా కొన్ని పరికరాలు ఇస్తూ ఉంటారు.

ప్రశ్న: ఎర్రకాలువ రిజర్వాయర్ వద్ద నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ ఎలా ఉంది? కోచ్‌లు ఉన్నారా?

పోలీస్ శాఖ నుంచి వాటర్ స్పోర్ట్స్ కోసం కోచ్‌ను డిప్యూటేషన్‌పై నియమించాం. అక్కడ శిక్షణ బాగానే సాగుతోంది.

ప్రశ్న: అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్మించిన షాపుల నుంచి గానీ, స్విమ్మింగ్ పూల్ నుంచి గాని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు ఎంత ఆదాయం వస్తోంది?

ప్రతినెలా షాపుల నుంచి అద్దెల రూపంలో లక్షా 25 వేల రూపాయలు వస్తాయి. వాటిని కరెంటు బిల్లులు, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం వినియోగిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఛైర్మన్ కాబట్టి వారి సమక్షంలోనే అంతా జరుగుతుంది.

ప్రశ్న: ఇండోర్ స్టేడియం కూలిపోయి సుమారు రెండు సంవత్సరాలు పైనే అవుతోంది. కొత్తగా నిర్మించే ప్రణాళిక ఉందా?

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి గతంలో రూ.2. కోట్ల 20 లక్షలతో అంచనా తయారు చేశాం. అమలు జరగలేదు. ప్రస్తుతం కూలిపోయిన స్టేడియం శిథిలాలు తొలగించడానికి హౌసింగ్ బోర్డుకు అప్పగించాం. సెంట్రల్ నిధుల నుంచి నూతన ఇండోర్ స్టేడియం నిర్మించే అవకాశం కోసం కలెక్టర్ చూస్తున్నారు.

ప్రశ్న: ఒకప్పుడు 'వెస్ట్ గోదావరి బెస్ట్ గోదావరి' అనేవారు, ఈ మధ్య జిల్లా క్రీడాకారులు అంత ప్రతిభ కనబరుస్తున్నట్లు లేదు, కారణం ఏంటి?

20 ఏళ్లుగా క్రీడారంగానికి అంత విధులు కేటాయించడం లేదు, కోచ్‌ల రిక్రూట్మెంట్ జరగడం లేదు. ప్రభుత్వాలు క్రీడా ప్రాధికార సంస్థకు అంత ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఉన్న కొద్దిపాటి సౌకర్యాలతో వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్ వంటి అంశాల్లో క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుతంగా రాణించి మెడల్స్ సాధించారు.

ప్రశ్న: క్రీడా ప్రాధికార సంస్థకు సిబ్బంది కొరత ఉందా?

ఉంది. ప్రస్తుతం ఆఫీసులో ఒక్క ఉద్యోగి మాత్రమే ఉన్నారు. గ్రౌండ్ మాన్‌లు అందరూ రిటైర్డ్ అయిపోయారు. కొత్త నియామకాలు జరగడం లేదు. మళ్లీ కార్యాలయ సిబ్బంది, కోచ్, గ్రౌండ్ మ్యాన్‌ల నియామకాలు చేపడితే జిల్లాకు క్రీడారంగంలో పూర్వ వైభవం వస్తుంది.

నేడు ధర్నాను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ భూముల సమస్యలనూ పరిష్కరించాలని, గిరిజనులు, దళితులు, పేదలకు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీన ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పి4 పేరుతో పేదరికాన్ని నిర్మూలిస్తామనడం, గరీబియా హటావో నినాదం తీసుకురావడంతో పేదరికం పోదన్నారు. భూమిలేని పేదలకు కనీసం ఎకరం గానీ రెండెకరాల భూమి పంచడం ద్వారా మాత్రమే పేదరికాన్ని నిర్మూలించొచ్చని తెలిపారు. ఒకపక్క ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పడిపోతున్నాయన్నారు. కోనేరు రంగారావు సిఫార్సుల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు దాదాపు 5 లక్షల 75 వేల ఎకరాలు ఉన్నాయని, ఈ రోజుకూ ఏ ప్రభుత్వమూ ఆ భూములను గుర్తించి, అక్రమార్కుల నుండి స్వాధీనం చేసుకొని, వాటిని పేదలకు పంపిణీ చేసి, హక్కు కల్పించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఆ భూములు సంపన్నులు చేతుల్లోనే ఉన్నాయన్నారు. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటికే అన్యాక్రాంతమైన ఎల్‌టిఆర్ భూములు 55 వేల ఎకరాలు ఉన్నాయని వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రెడ్యానాయక్ అసెంబ్లీలో ప్రకటన చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఆ భూములు ఎక్కడున్నాయి? ఎవరి చేతుల్లో ఉన్నాయని గుర్తించడం గానీ, వాటిని స్వాధీనం చేసుకోవడం గానీ, ఆ ప్రాంత గిరిజనులకు అప్పగించడం గాని చేయలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమి కొనుగోలు పేరుతో గిరిజనులు సాగు చేసుకుంటున్న ఎల్‌టిఆర్ భూములనే గిరిజనేతరుల పేరుతో తప్పుడు రికార్డులు సృష్టించి చట్టవిరుద్ధంగా కొనుగోలు చేస్తున్నారని, ఆ భూములనే నిర్వాసిత గిరిజనులకు ఇచ్చి స్థానిక గిరిజనులకు, నిర్వాసిత గిరిజనులకు మధ్య తగాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. జిల్లాలో అసైన్డ్, సీలింగ్, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములు, దెందులూరు, దోసపాడు, కొవ్వలి, నూజివీడు ప్రాంతంలో ఆగిరిపల్లి, చింతలపూడి, కైకలూరు ప్రాంతంలో మండవల్లి, సింగన్నపూడి చోట్ల భూ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములు చెందితే ప్రభుత్వానికే చెందాలని, లేకపోతే ఆ ప్రాంతంలో అర్హులైన గిరిజనులు, దళితులు, పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో గిరిజనులు, దళితులు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తగ్గిన వరద గోదావరి

ప్రజాశక్తి - పోలవరం

గత ఐదు రోజులుగా ఉధృతంగా పెరిగిన గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 6,79,782 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.100 మీటర్లు స్పిల్‌వే దిగువన 22.300 మీటర్లు నమోదైనట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. అదనంగా వస్తున్న వరద జలాలు స్పిల్‌వే 48 గేట్ల నుండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

టిడిపి జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్లు


మాట్లాడుతున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించిన టిడిపి పార్లమెంట్ కమిటీలను ఏర్పాటు చేసే నిమిత్తం ప్రతిపాదనలను సేకరించేందుకు నియోజకవర్గ స్థాయిలో పట్టణంలోని క్రాంతి కళ్యాణ మండపంలో ఏలూరు పార్లమెంటరీ పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఉన్న గొట్టిపాటి రవి, బుద్ధ నాగజగదీష్, ఎంఎస్.రాజు హాజరయ్యారు. మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష పదవితో పాటు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష, ఇతర పదవులకు పోటీపడి నాయకులు పార్టీ పరిశీలకులను కలిసి తమ పేర్లను పరిశీలించాలని కోరుతూ దరఖాస్తులు అందించారు. వాటన్నింటినీ పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకెళ్తామని పరిశీలకులు హామీ ఇచ్చారు. పార్టీలో కష్టపడిన వారికి కుల ప్రాతిపదికన సామాజిక తరగతుల ప్రాతిపదికన ఎన్నిక జరుగుతుందని, వారికి మాత్రమే పదవులు వస్తాయని ఎంఎస్.రాజు అన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం జిల్లా అధ్యక్ష పదవికి గతంలో జిల్లా అధ్యక్షుడిగా చేసిన గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ, జంగారెడ్డిగూడేనికి చెందిన పెనుమర్తి రామ్‌కుమార్, కొంతమంది బిసి నాయకులు ఇలా పలువురు అధ్యక్ష పదవికి నామినేషన్లు వేసినట్లు తెలుస్తుంది. అయితే ఈ సమావేశంలో ఇతర పార్టీల నేతనును చేర్చుకోవడం, వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై నాయకుల మధ్య తీవ్ర చర్చ జరిగినట్లు తెలిసింది.

సిపిఎం నుంచి సోమయ్య బహిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం నుంచి ఆ పార్టీ పూర్వ జిల్లా, నగర కమిటీ సభ్యులు బి.సోమయ్యను బహిష్కరిస్తున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పత్రికలకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతి, అనైతిక చర్యలతో పాటు పార్టీ విచ్ఛిన్నకర కార్యకలాపాలు, క్రమశిక్షణ ఉల్లంఘన తదితర చర్యల కారణంగా సోమయ్యను పార్టీ నుంచి బహిష్కరించినట్లు రవి తెలిపారు. కొంతకాలం క్రితం ఆయనపై చర్యలు తీసుకున్నామని, అయినా తన తప్పులను గుర్తించి సరిదిద్దుకోకపోగా అవే చర్యలను సమర్థించుకుంటూ పార్టీ విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పార్టీ ప్రమాణాలు, విలువలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, తన తప్పులను సమర్థించుకుంటూ పార్టీపై నిందలు వేస్తున్నారని తెలిపారు. దీనిపై జులై 21న ద్వారకాతిరుమలలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో చర్చించి ఆయనను బహిష్కరిస్తూ తీర్మానించినట్లు తెలిపారు. తర్వాత అయినా అతనిలో మార్పు వస్తుందని ఆశించామని, ఆయనలో ఏమార్పూ లేకపోగా పార్టీని కించపరుస్తూ దుష్ప్రచారం సాగిస్తున్నాడని, అందుకే నేడు పత్రికాముఖంగా తెలియజేస్తున్నామని తెలిపారు. ఇక భవిష్యత్తులో పార్టీకి ఆయనకు ఎటువంటి సంబంధమూ లేదని, ఆయన చర్యలకు పార్టీ బాధ్యత వహించదని, ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పామాయిల్ కార్మికులను ఆదుకోవాలి

బీమా సౌకర్యం కల్పించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ



ఆందోళన చేస్తున్న నేతలు, పామాయిల్ కార్మికులు

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వారి సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పామాయిల్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాపురంలో ఆదివారం నిర్వహించిన పామాయిల్ కార్మిక సంఘం మండల స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. పామాయిలు గెలలు కోస్తూ కార్మికులు విద్యుదాఘాతంతో చనిపోతే అధికారులు, ప్రభుత్వం స్పందించరా అని ప్రశ్నించారు. జిల్లాలో పామాయిల్ కార్మికుల పరిస్థితి దినదినగండంగా ఉందన్నారు. పామాయిల్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యానవన శాఖ, కార్మిక శాఖ, విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యానికి పామాయిల్ కార్మికులు బలి పశులవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో చనిపోయిన పామాయిల్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఈ రెండు నెలల కాలంలోనే సుమారు ఐదుగురు పామాయిల్ కార్మికులు విద్యుదాఘాతంతోనే చనిపోయినా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. పామాయిల్ కార్మికులు తలుచుకుంటే ఒకరోజు సమ్మె చేస్తే ఈ జిల్లాలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీలు నడుస్తాయా అని ప్రశ్నించారు. పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కితే స్పందించే ఎంపీ కార్మికులు రోడ్డు ఎక్కి గొడవ చేసినా కనీసం కనబడట్లేదా అని ప్రశ్నించారు. జిఒ 73ను అమలు చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 15 వేల మంది పామాయిల్ కార్మికులు మట్టలు గెలలు కోయడంతో పాటు లోడింగ్ అన్‌లోడింగ్ చేసే కార్మికులు ఉన్నారని తెలిపారు. వారు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ రెండో తేదీన జిల్లాలో ఉన్న పామాయిల్ కార్మికుల జిల్లా సదస్సు, మహాసభ జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి పామాయిల్ కార్మికులు కదలి రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ పేదవాడి బతుకు సెటిల్‌మెంట్‌తోనే ముగిసిపోవాలా అని ప్రశ్నిం చారు. కనీసంగా ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. మండల నాయ కుల వర్మ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వెంకటాపురం, కొణిజర్ల వెంకటాద్రిగూడెం, సీతానగరం, మరో ఐదు గ్రామాల నుంచి 150 మంది పామాయిల్ కార్మికులు, వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచి శ్రీను హాజరయ్యారు. జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ, శ్రీను, హరీష్, రమేష్ రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నుంచి..

రూ. ఐదు లక్షల పరిహారం అందజేత

పామాయిల్ తోటలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కార్మికుల కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రతినెలా రెండో తేదీన సేఫ్టీ డే కార్యక్రమం

విద్యుత్‌శాఖ జిల్లా అధికారి పి.సాల్మన్‌రాజు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎవరైనా పామాయిల్ తోటల్లో విద్యుదాఘాతంతో చనిపోతే విద్యుత్ సంస్థ ప్రమేయం లేకపోయినా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం లేకపోయినా విద్యుత్ సంస్థ నుంచి రూ. ఐదు లక్షల వరకూ ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి.సాల్మన్‌రాజు తెలిపారు. ఈ నెల 23వ తేదీన 'ప్రాణాలు పోతున్నా పట్టదా..' అంటూ ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. ఎప్పుడో పూర్వం వేసిన విద్యుత్ లైన్ల కింద పామాయిల్ మొక్కలు నాటుతున్నారని తెలాఇపారు. ఈ మొక్కలు విపరీతంగా పెరగడం వల్ల విద్యుత్ లైన్లకు అతి సమీపంలో ఉంటున్నాయని, పామాయిల్ తోటల్లో గెలలు కోసేందుకు పొడవాటి ఇనుప గెడలు, కత్తులు ఉపయోగిస్తున్నారన్నారని తెలిపారు. ఇవి చాలా బరువుగా ఉండడం చేత బ్యాలెన్స్ చేసుకోకపోవడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడి పామాయిల్ కార్మికులు విద్యుదాఘాతానికి గురవుతున్నారని తెలిపారు. రైతులు విద్యుత్ సిబ్బందికి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని, ముందుగా సమాచారం తెలియజేస్తే విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో లైన్ క్లియరెన్స్ తీసుకుని విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెలా రెండో తేదీన విద్యుత్ మండల కార్యాలయాల్లో సేఫ్టీడేను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పామాయిల్, కొబ్బరి, ఇతర రైతులు, కార్మికులకు విద్యుత్ భద్రతపై అవగాహన శిబిరాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పాలన, ఉద్యాన శాఖ, పామాయిల్ ప్రాసెసింగ్ కంపెనీలతో సమన్వయం చేసుకొని ఒక జాయింట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల రక్షణ కోసం హెల్మెట్లు, గ్లౌజులు, పొడవాటి పరికరాలు ఉపయోగించుకోవడం వంటి భద్రతా సాధనాలను తప్పనిసరి చేయడంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్

2న గురవాయిగూడెం వద్ద హైవే దిగ్బంధనం

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సు తీర్మానం



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, భూ నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు తారురోడ్లుగా నిర్మించాలని, భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రమైన టి.నర్సాపురంలోని శివాలయం ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వర కళ్యాణమండపంలో ఆదివారం గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించగా గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ రెండో తేదీ ఉదయం పది గంటలకు సర్వీస్ రోడ్లు, పరిహారం పెంపు తదితర సమస్యలపై జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం వద్ద హైవే దిగ్బంధనం కార్యక్రమం చేపట్టాలని సదస్సు నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారన్నారు. అతి తక్కువ పరిహారం ఇవ్వడం వల్ల భూసేకరణలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా రోడ్డు నిర్మాణం పూర్తవుతున్న దశలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు రైతులను మోసగించడం అన్యాయమన్నారు. రైతులకు, ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం చేస్తున్నారని చెప్పారు. ఈ నెల 4న జరిగిన చలో కలెక్టరేట్ ధర్నా సందర్భంగా కలెక్టర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు, ప్రజలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వామిశెట్టి హరిబాబు, పర్వతనేని మురళి, మాలెంపాటి హరిబాబు, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రభుత్వాలకు ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్నా రైతులు, ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు రామకృష్ణ, దావులూరి రాంబాబు, అద్దంకి జగ్గారావు, బాహుబలి రాజు, దావులూరి వెంకటేశ్వరరావు, బైగాని సత్యనారాయణ, భూ బత్తుల రాంబాబు, మరీదు నాగేశ్వరరావు, చీకటి సర్వేశ్వరరావు, గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సిలో కృష్ణవేణి ప్రతిభ

88 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన వైనం

పలువురి అభినందనలు



ప్రజాశక్తి - మండవల్లి

డిఎస్‌సి ఫలితాల్లో చావలపాడు మహిళా మండలి కాలనీకి చెందిన పల్లెడ కృష్ణవేణి ఫిజికల్ డైరెక్టర్ విభాగంలో విజయం సాధించారు. 88 మార్కులు సాధించి కృష్ణా జిల్లా టాపర్‌గా నిలిచి ఉద్యోగం సాధించింది. కృష్ణవేణికి మహిళా మండలి కాలనీకి చెందిన తాడి విజయ్‌కు వివాహం కాగా వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గృహిణిగా ఉంటూనే కృష్ణవేణి డిఎస్‌సిలో విజయం సాధించాలని, ప్రభుత్వ ఉద్యోగం పొందాలని ఎన్నో కలలు కన్నది. ఆ కలలను సాకారం చేసుకునే విధంగా ఒంగోలులోని కోచింగ్ సెంటర్‌లో ఏడాది పాటు డిఎస్‌సి కోచింగ్ తీసుకుంది. పిల్లలకు, భర్తకు, అత్తమామలకు, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూనే మనోధైర్యాన్ని పెంపొందించుకుని తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం కోసం ఆహర్నిశలు కృషి, పట్టుదలతో కోచింగ్ పూర్తి చేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డిఎస్‌సిలో పాల్గొని జిల్లా టాపర్‌గా విజయం సాధించింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు మండలానికి చెందిన పలువురు నాయకులు, ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి గంజిమాల రామారావు

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కన్నాపురం గ్రామంలో రూ.మూడు లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి గంజిమాల రామారావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉప్పల కృష్ణ, ఎంపిటిసి సభ్యులు, వైసిపి గ్రామ అధ్యక్షులు, పార్టీ నాయకులు, స్థానిక వార్డు సభ్యులు, ఎస్‌సి సెల్ జిల్లా నాయకులు చిడిపి రవి, వైసిపి కన్నాపురం నాయకుడు నాగూర్, కొయ్యలగూడెం గ్రామ పంచాయతీ పదో వార్డు సభ్యుడు పూలపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేతకు మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - మండవల్లి

మాతృమూర్తిని కోల్పోవడం ఎంతో బాధను మిగులుస్తుందని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. వైసిపి అయ్యావారి రుద్రవరం నాయకులు బొబ్బిలి రత్తయ్యనాయుడు మాతృమూర్తి సీతామహాలక్ష్మికి ఆదివారం నిర్వహించిన పెదకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఎవరినైనా కోల్పోవడం అనేది ఎంతో బాధను మిగులుస్తుందన్నారు. తల్లిని కోల్పోవడం అనేది మరింత బాధను కలుగచేస్తుందన్నారు. మనోధర్యం పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, భలే నాగరాజు, థామస్, రాజు, గుడివాడ సత్యవరప్రసాద్, సమయం రామాంజనేయులు, బంజా రామారావు, సోమల శ్యామసుందర్, అర్జ విజయ్, పంజా నాగు, సర్పంచి బోనం శేషగిరి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆటో డ్రైవర్లు రహదారి నియమాలను కచ్చితంగా పాటించాలని కుక్కునూరు ఎస్ఐ రాజారెడ్డి సూచించారు. స్థానిక ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ఆయన ఆదివారం కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రహదారి నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను నివారించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాలను సరైన స్థితిలో నిర్వహించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని చెప్పారు.

రంగా వ్యక్తి కాదు మహాశక్తి

వంగవీటి రాధాకృష్ణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

కీర్తిశేషులు మాజీ ఎంఎల్ఎ వంగవీటి మోహన్ రంగా వ్యక్తి కాదని, మహాశక్తి అని మాజీ ఎంఎల్ఎ రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని ఈడేపల్లిలో రెండు వర్గాలు ఏర్పాటు చేసిన రెండు విగ్రహాలను రాధాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రంగా హత్య చెంది మూడు దశాబ్దాలు దాటినప్పటికి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి అనునిత్యం ప్రభుత్వాలపై పోరాటం చేసి విజయం సాధించారన్నారు. తెలుగు జాతి ఎన్నటికీ మరువలేదని, అందుకు ఈ విగ్రహాల ఆవిష్కరణనే తార్కాణమని తెలిపారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం పరితా పించిన వ్యక్తిగా రంగాను కొనియాడారు. అదేవిధంగా కీర్తిశేషులు గ్రామ మాజీ సర్పంచి బండి వెంకన్నబాబు విగ్రహాన్ని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా ముదినేపల్లిలోని ఎన్‌డిఎ కార్యాలయం నుంచి ఈడేపల్లి వరకు రంగా, వెంకన్నబాబు అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, గ్రామ సర్పంచి అబ్బినేని వెంకటేశ్వరరావు, ఎఎస్.బాబు, బండి వెంకన్నబాబు కుటుంబ సభ్యులు, ఎన్‌డిఎ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత వంగవీటి రాధాకృష్ణ ముదినేపల్లిలోని సంత మార్కెట్‌లో ఉన్న రంగా విగ్రహానికి, సర్దార్ గౌతు లచ్చన్న, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం ఈడేపల్లిలోని విగ్రహాల విష్కరణకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ - కో కన్వీనర్ కొడాలి వినోద్ పాల్గొన్నారు.



స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు

వీధి కుక్కల స్వైర విహారం

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిపై, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిపై వీధి కుక్కలు ఎగబడుతున్నాయి. నగర పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచన్నగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం మధ్యాహ్నం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,470 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోనుకుమాడు సబ్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా..!

తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేతతో ప్రజల అవస్థలు

అమలు కాని విద్యుత్‌శాఖాధికారి హామీ

త్వరగా ఏర్పాటు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పోనుకుమాడు సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన గ్రామసభలో మూడు నెలల్లో పోనుకుమాడు సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెం డివిజన్ డిఇ కలెక్టర్‌కు, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు హామీ ఇచ్చారు. కాని ఇప్పటివరకు సబ్ స్టేషన్ పనులు మొదలు పెట్టని పరిస్థితి.

చింతలపూడి మండలంలోని పోనుకుమాడు సబ్ స్టేషన్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, ఎప్పుడు ప్రగడవరం పంచాయతీ, కరెంటు సమస్యలు తొలగిపోతాయోనని పంచాయతీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీలో శంకుచక్రపురం సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 3,600 అగ్రికల్చర్ డొమెస్టిక్ సర్వీసులు ఉన్నాయి. ప్రగడవరం పంచాయతీలో కాకుండా, సబ్ స్టేషన్ పరిధిలో తిమ్మిరెడ్డిపల్లి పంచాయతీ, టి.నరసాపురం మండలానికి చెందిన తెడ్డెం పంచాయతీ సర్వీసులు కూడా ఇదే స్టేషన్ పరిధిలో ఉండడంతో ఓవర్ లోడ్‌లతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అగ్రికల్చర్ సర్వీసులు, డొమెస్టిక్ సర్వీసులు కలిపి ఉండడంతో చిన్నపాటి గాలి, వర్షం వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో ఆ సమస్య పరిష్కరమయ్యేవరకూ గంటైనా, రెండు గంటలైనా విద్యుత్ సరఫరా ఇచ్చేవరకూ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. రోజుకు పది సార్లు ఏదో సమస్యపై విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న పరిస్థితి నెలకొంది.

కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆర్‌డిఎస్ వర్క్స్ పేరుతో వారానికి రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మూడు గంటల పాటు అని చెప్పి ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా ఇవ్వని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ఎందుకు వేగంగా జరగటం లేదో తెలియడంలేదని వాపోతున్నారు. ఆర్‌డిఎస్ వర్క్స్ త్వరగా పూర్తయితే విద్యుత్ సరఫరా నిలిపివేతకు కొంత ఉపశమనం కలుగుతుందని రైతులు చెబుతున్నారు.

చింతలపూడి మేజర్ పంచాయతీ కావటంతో, సర్వీసులు కూడా ఎక్కువగా ఉండడంతో, ఇటు డొమెస్టిక్ సర్వీసులో సమస్య వచ్చినా అగ్రికల్చర్ సర్వీసులో సమస్యలు వచ్చినా విద్యుత్ శాఖ సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ పంచాయతీలో పనిచేయడం కూడా వారికి సవాల్‌గా మారింది.

లైన్‌మెన్‌ను నియమించరా..!

చింతలపూడి మండలంలో ప్రగడవరం పంచాయతీ మేజర్ పంచాయతీ. కాని లైన్‌మెన్ లేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటివరకు లైన్‌మెన్‌ను నియమించలేదు. జనవరి నెలలో లైన్‌మెన్‌ను నియమిస్తామని జంగారెడ్డిగూడెం డివిజన్ అధికారులు చెప్పినా నేటి వరకు దాని గురించి పట్టించుకోలేదు. మేజర్ పంచాయతీలో లైన్‌మెన్ లేకపోవడంతో రైతులకు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి పెట్టి పోనుకుమాడు సబ్‌స్టేషన్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని, లైన్‌మెన్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజుల్లో సత్యసాయి కార్మికులకు నెల జీతం

15 రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు కృషి

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ హామీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రెండు రోజుల్లో సత్యసాయి కార్మికులకు జిల్లా పరిషత్ నిధుల ద్వారా నెల జీతం చెల్లిస్తామని, 15 రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు కృషి చేస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ హామీ ఇచ్చారు. శ్రీ సత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు వారి సమస్యలపై రెండు రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఆదివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను కలిసి తమ



జెడ్‌పి చైర్‌పర్సన్‌కు వినతి అందిస్తున్న యూనియన్ సభ్యులు

సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వెంటనే స్పందిస్తూ జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జి.త్రినాథ్‌బాబు సమక్షంలో యూనియన్ సభ్యులకు హామీ ఇచ్చారు. రెండు రోజుల్లోపు జిల్లా పరిషత్ నిధుల ద్వారా ఒక నెల జీతం చెల్లిస్తామని, మిగిలిన పెండింగ్ జీతాలను 15 రోజుల్లో చెల్లించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యూనియన్‌లో ఉన్న కార్మికులందరికీ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ తెలిపారు.

పోలవరం : తమ జీతాల బకాయిల కోసం గత రెండు రోజుల క్రితం సమ్మె బాటపట్టిన కార్మికుల సమ్మె ఆదివారంతో ముగిసింది. ఆర్‌డబ్ల్యుఎస్ఇ, జిల్లా పరిషత్ సిఇఒ సత్యసాయి తాగునీటి సరఫరా కాంట్రాక్టర్ జిల్లా పరిషత్ ఛైర్మన్ సమక్షంలో జరిపిన చర్చలు ఫలించాయి. సోమవారం నుంచి నీటి విడుదల ప్రారంభం చేయనున్నట్లు సత్యసాయి కార్మికులు తెలిపారు. అధికారులతో జరిపిన చర్చల్లో సత్యసాయి కార్మిక సంఘం మాజీ కార్యదర్శి సతీష్, అధ్యక్షులు జి.శివసత్యనారాయణ, సత్యనారాయణ, పిల్లి వీరబాబు, బొంత ప్రసాద్, పోసిబాబు, ఎం.శ్రీనివాసరావు, బాబు, భాస్కర్ పాల్గొన్నట్లు కార్మికులు తెలిపారు.

గణేష్ ఉత్సవాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిర్వహించే గణేష్ ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ ఎం.జయబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఆదివారం గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ్ యాప్‌పై అవగాహన కల్పించారు. విగ్రహాల వద్ద, నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు పొందాలని, కమిటీల వారు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబాసు సిబ్బందితో కలిసి నూజివీడు మండలంలో రానున్న వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను నెలకొల్పే ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు పలు సూచనలు చేశారు. విగ్రహాలను నెలకొల్పే ప్రదేశాలు శుభ్రంగా సురక్షితంగా ఉండాలన్నారు. ప్రజా రవాణా, వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికలు చేయాలన్నారు.

ముసునూరు : వినాయక చవితి పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే వినాయకుని విగ్రహాలు ఆయా మండపాలు వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సూచనలు పాటించాలని ఎస్ఐ ఎం.చిరంజీవి చెప్పారు. ఎఎస్ఐ, పోలీస్ శాఖ సిబ్బందితో కలిసి మండలంలోని ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలకు వెళ్లి అవగాహన కల్పించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు చేశారు.



పాఠశాలలో టెంట్, షామియానా సామగ్రి

పాఠశాలలో టెంట్ షామియానా సామగ్రి

ఉపాధ్యాయులు, విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో టెంట్ షామియానా సామగ్రి ఉంచడం వల్ల విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుడిపాడు గ్రంథాలయం దగ్గరలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో టెంట్ షామియానా సామగ్రి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు.

జీలుగుమిల్లిలో యూరియా కొరత

ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులు ఎరువుల కోసం సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం పండించే వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు యూరియా తప్పనిసరైనా మండలంలో ఉన్న నాలుగు సొసైటీల వద్ద ఎక్కడా కూడా యూరియ లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రయివేట్ ఎరువుల దుకాణదారులు యూరియాను నిల్వ చేసుకుని, వారి వద్ద ఉన్న తక్కువ రకం పురుగు మందులు కొంటేనే యూరియాను విక్రయిస్తూ అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా మాత్రమే కావాలంటే పక్క రాష్ట్రం తెలంగాణ వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎరువుల కొరత లేకుండా చూడాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పలువురికి ఇంకా రాని కాల్‌లెటర్స్

సందిగ్ధంలో అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి 2025కు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం వట్లూరులోని సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ ఆదివారం సాయంత్రం వరకు అభ్యర్థులకు కాల్ లెటర్స్ రాలేదు. దీంతో సోమవారం వెరిఫికేషన్ జరుగుతుందా లేక మంగళవారానికి వాయిదా పడుతుందా అన్న సందిగ్ధం ఏర్పడింది. జిల్లాలో మొత్తం 1,074 పోస్టులు ఉండగా అందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 420 ఉండగా 656 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. వీరందరికీ సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసేందుకు సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 22 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం 200 మంది సిబ్బంది పని చేయనున్నారు. అయితే వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకుని సదరు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయటంతోపాటు గెజిటెడ్ అధికారి అటెస్ట్ చేసిన మూడు సెట్‌లు సర్టిఫికెట్లు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాల్సి ఉంది. అయితే ఆదివారం సాయంత్రం వరకు అభ్యర్థులకు కాల్ లెటర్స్ రాకపోవడంతో వెరిఫికేషన్ సోమవారం జరుగుతుందా లేదా అనే సందిగ్ధత ఏర్పడింది. అయితే ఆదివారం రాత్రి ఏ సమయంలోనైనా కాల్ లెటర్స్ అధికారులు అప్‌లోడ్ చేయవచ్చని, అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని సోమవారం వెరిఫికేషన్‌కు హాజరు కావచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఒకవేళ ఏదైనా ఆలస్యమైతే వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారానికి వాయిదా పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఫిట్‌నెస్ జోన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు గడియార స్తంభం సెంటర్ కత్తేపు వారి వీధిలో అల్టిమేట్ ఫిట్‌నెస్ జోన్ సెంటర్‌ను ఆదివారం ఎంఎల్ఎ బడేటి చంటి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. తొలుత ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి జిమ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ నాగరాజు వారి ఆధ్వర్యంలో జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే విధంగా చేయడం అభినందనీయమన్నారు. ఏలూరు నగర ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు



ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి


ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర్ ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, ఎఎంసి మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, కార్పొరేటర్ కర్రీ శ్రీనివాసరావు, ట్రైనర్లు పి.ఆనంద్, బి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 30 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు

ప్రజాశక్తి - కలిదిండి

ఇరిగేషన్ భూముల్లో నివాసముంటున్న వారికి జిఒ 30 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వందేళ్ల నుంచి మండలంలోని పెదలంక రెవెన్యూ డివిజన్‌లోని మూలలంక, భాస్కరరావుపేట, సంతోషపురం గ్రామాల్లో వందలాది కుటుంబాలు ఇరిగేషన్ భూముల్లో జీవనం సాగిస్తున్నాయన్నారు. గ్రామపంచాయితీలు ఏర్పడడంతో పాటు రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం ఉన్నప్పటికీ, ఇరిగేషన్ భూముల్లో నివసిస్తున్నారనే నెపంతో పట్టాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. గతంలో పలువురికి పొజిషన్ సర్టిఫికెట్స్ ఇచ్చి, నిలుపుదల చేశారన్నారు. దీంతో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం వర్తించక పేదలు నష్టపోయారన్నారు. ఇటీవల మంగళగిరి నియోజకవర్గంలో ఇరిగేషన్ భూములకు పట్టాలు మంజూరు



సంతకాలు సేకరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

చేయడంతో ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సంతకాల సేకరణ చేపట్టామన్నారు. పంట కాలువకు, ఆర్అండ్‌బి రహదారికి ఇబ్బంది లేకుండా నివాసముంటున్న వారికి తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు వి.భాస్కరరావు, బి.రామనాగేంద్రం, సత్యనారాయణ, కొల్లి సతీష్, కె.రజని, నక్క వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జామాయిల్ అక్రమ టోల్ వసూళ్లపై చర్యలేవి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రరావు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

జామాయిల్ అక్రమ టోల్ వసూళ్లపై చర్యలేవి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వ అధికారులను ప్రశ్నించారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సిపిఎం ముఖ్య కార్యకర్తలు సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడారు. మండలంలో బోనగిరి, రాయిగూడెం, ఇబ్రహీంపేట, గణపవరం, బంజరగూడెం, అల్లిగూడెం, వేలేరు గ్రామాల్లో వెయ్యికి పైగా జమాయిలు నర్సరీలు ఉన్నాయి. అట్టి నర్సరీలు, గిరిజనులు కాకుండా గిరిజనేతరులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు చర్యలు తీసుకోకుండా వీళ్లకు అనుకూలంగా గణపవరం, తొండిపాక, పెదరావిగూడెం గ్రామ పంచాయతీలు బయట వ్యక్తులకు వేలంపాట పేరుతో ఇచ్చి అక్రమంగా టోల్ పన్ను వసూలు చేస్తున్నారన్నారు. జామాయిలు మొక్కలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ స్థానిక వ్యాన్, మినీ వ్యాన్ డ్రైవర్లకు ఉపాధి ఉండటం లేదన్నారు. అక్రమ వసూలు చేయడానికి, వేలం పాట ద్వారా బయట వ్యక్తులకు కాంట్రాక్టు ఇవ్వడానికి ఏ ఆర్డర్ కాపీ ఉందని ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పలుమార్లు ఈ విషయంపై విమర్శలు వస్తున్నా స్థానిక అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమంగా టోల్ వసూలు చేస్తున్నవారిపై, అక్రమంగా నిర్వహిస్తున్న నర్సరీలపై, వీటిని ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు యర్నం సాయికిరణ్, షేక్ వలీపాషా, శ్యామల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో చేర్చాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల ప్రజల కోరిక మేరకు కైకలూరు నియోజకవర్గాన్ని మచిలీపట్నం కేంద్రంగా కృష్ణా జిల్లాలో చేర్చాలని మంత్రివర్గ ఉప సంఘానికి, కలెక్టర్‌కు ముదినేపల్లి మండల నాయకులు వినతిపత్రాలు అందించారు. ఏలూరు కన్నా మచిలీపట్నం జిల్లా కేంద్రంగా దగ్గరని, డివిజన్ల పరంగా గుడివాడ, మచిలీపట్నం దగ్గరని ఏలూరు దూరమన్నారు. కృష్ణా నదీ నీరు కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి, కైకలూరు శివారు భూములకు సాగు, తాగు నీటి సరఫరాలో రెండు జిల్లాల అధికారుల సమన్వయ లోపాల వల్ల ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నియోజకవర్గంలోని ముదినేపల్లి మండలం గుడివాడకు అత్యంత సమీపంగా ఉండడంతో ఇక్కడి ప్రజలు, రైతులు తమ ప్రాంతాన్ని కృష్ణాలో విలీనం కోరుతున్నారని, పైకారణాలే కాకుండా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజల మనోగతాన్ని అర్థం చేసుకుని నియోజవర్గాన్ని కృష్ణా జిల్లాలో విలీనం చేయాలని మంత్రివర్గ ఉప సంఘానికి, కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు, మహాత్మ జ్యోతిరావు పూలే కమిటీ అధ్యక్షులు పళ్లెం పుణేశ్వరరావు, ముదినేపల్లి మండల నాయకులు తెలిపారు.

విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని అన్నవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ నెల 29వ తేదీన క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాల సంధర్భంగా ఆటలపోటీలు, వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు, చెస్ పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమారి తెలిపారు. అనంతరం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రం, నాగరాజు, దుర్గా మల్లేశ్వరరావు, మంగలక్ష్మి, ఫిలోమిన, జాస్మిన్, వెంకట రమణ, కృష్ణకుమారి, రాజేంద్రప్రసాద్, బివివిఎస్‌వి.ప్రసాద్, ఫిజికల్ డైరక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పోలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మురుగు కాల్వల్లో ఆదివారం దోమల మందు పిచికారీ చేశారు. గ్రామ సర్పంచి నాగ ముసలయ్య మాట్లాడుతూ లార్వా దశలో నివారణ చర్యలు చేపడితే దోమలను పూర్తిగా తరిమికొట్టవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వై.శివరంగారావు, ఎఎన్ఎం మురళి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మంత్రి సొంత నిధులతో రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని తుక్కులూరు గ్రామంలో శ్మశానవాటిక నుంచి తొలగించిన వ్యర్థాలను వారి రోడ్డులో పోయడం పట్ల మంత్రి పార్థసారథి స్పందించారని టిడిపి నూజివీడు మండలాధ్యక్షులు యనమదల వాసు అన్నారు. తుక్కులూరులో ఆయన ఆదివారం మాట్లాడుతూ మంత్రి పార్థసారధి ఆదేశంతో శ్మశానవ్యర్థాలను గ్రామానికి దూరంగా తరలించనున్నట్లు తెలిపారు. వారి రోడ్డును మంత్రి పార్థసారధి సొంత ఖర్చులతో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.